## రిపోర్టర్స్ కావలెను

బి. అనిల్‌కుమార్, ఎడిటర్
77028 66885



TELTEL/2021/81079

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం    ఎడిటర్ : అనిల్ కుమార్

CIRCULATED FROM TELANGANA AND ANDRAPRADESH



B. ANIL KUMAR
CHAIRMAN & CHIEF EDITER
7702866885
9059324231

DAIWIK PUBLICATIONS & BROADCASTING PVT. LTD.
www.aksharavijetha.com., epaper.aksharavijetha.com
email : vijethatelugudaily@gmail.com

సబ్ ఎడిటర్లు కావలెను.

ప్రారంభమైన అనతి కాలంలోనే తెలుగు రాష్ట్రాల ప్రజల అభిమానాన్ని చురగొంటూ తెలుగు మీడియా రంగంలో దూసుకుపోతున్న విజేత తెలుగు జాతీయ దినపత్రికకు సెంట్రల్ డెస్క్, జిల్లా టాబ్లాయిడ్‌లలో పని చేయుటకు సబ్ ఎడిటర్లు కావలెను.

ఎడిటింగ్ నైపుణ్యంతో పాటు ఆకర్షణీయంగా పేజినేషన్ చేయగలగాలి. కోరుకున్న వారికి వర్క్ ఫ్రం హోమ్ కల్పించబడును.

సంప్రదించుటకు : 7702866885, 9059324231



వరంగల్ | బుధవారం, ఆగస్టు 07, 2024 | AKSHARA VIJETHA Telugu Daily | సంపుటి : 4 సంచిక : 271 | వెల : రూ. 1.00 | పేజీలు : 4


# పిప్పిరికి నేడు డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క

- పాదయాత్ర హామీల అమలులో భాగంగా రూ. 20.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఆదిలాబాద్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు
- ధరణీ, టీఎస్‌పీఎస్సీలను ప్రక్షాళన చేస్తానని పాదయాత్రలో ప్రకటించింది ఇక్కడే..!
- నెల రోజులు సాగిన పాదయాత్రతో ప్రత్యేక అనుబంధం ఏర్పరుచుకున్న భట్టి
- డిప్యూటి సీఎం పిప్పిరి పర్యటనకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రాజాకీయ ముఖ చిత్రాన్ని మార్చిన పీపుల్స్ మార్చ్‌గ్రామానికి తొలిసారిగా డిప్యూటి సీఎం హోదాలో భట్టి విక్రమార్క బుదవారం వస్తున్నారు. పాదయాత్ర ప్రారంభం సందర్భంగా ఆనాడు ఇచ్చిన హామీల అమలులో భాగంగా నేడు దాదాపు 20 కోట్ల 50లక్షల రూపాయల అభివృద్ధి పనులకు డిప్యూటి సీఎం శంకుస్తాపన చేస్తున్నారు. కొట్లాడి కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో స్వేచ్ఛ, భావప్రకటనను హరిస్తూ నిరంకుశ, నియంతృత్వ పాలన సాగించిన బిఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడి ఇందిరమ్మ రాజ్యం తీసుకురావడానికి ఆనాటి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామాం నుంచి 2023 మార్చి 16న పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. పాదయాత్ర ప్రారంభించిన గ్రామానికి డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క సరిగ్గా 16 నెలల తరువాత వస్తున్న సందర్భంగా ఆనాడు పాదయాత్రలో అడుగులో అడుగులు కలిపిన కాంగ్రెస్ శ్రేణులు భట్టిని కలువడానికి నేడు పెద్ద ఎత్తున పిప్పిరికి తరలివస్తున్నారు. డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చూస్తుండగా, జిల్లా ఎస్‌పి పోలీస్ బందోబస్తు చూస్తున్నారు. పిప్పిరి గ్రామాంలో నేడు ఎస్సీ కార్పోరేషన్, ట్రైకార్, ఐటీడీఏ బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన చెక్కులను, ఆస్థులను డిప్యూటి సీఎం లబ్దిదారులకు పంపిణీ చేస్తారు.

సీఎల్పీ నాయకుడిగా భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర తెలంగాణ రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చుతూ సరికొత్త చరిత్రను ఆవిష్కరింపజేసింది. ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్ర 16 జిల్లాలు, 37 నియోజకవర్గాలు, 700కు పైగా గ్రామాల మీదుగా సాగి ఖమ్మం నగర నడిబొడ్డున కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో జరిగిన భారీ బహిరంగ సభ వేదికగా ముగిసిన విషయం విధితమే. మార్చి 16న పిప్పిరి నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఆదిలాబాద్ జిల్లాలోని వాగులు వంకలు దాటుకుంటూ.., ఎత్తైన గుట్టలు ఎక్కుతూ దిగుతూ.., రాళ్లు రప్పల్లో నడుస్తూ భట్టి విక్కమార్క ఆదివాసీలను కలిశారు. పాదయాత్రలో గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఆయనను కలిసేందుకు ఆసక్తి చూపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అందుకు తగ్గట్లే మల్లు భట్టి విక్రమార్క 'వచ్చేది ప్రజా ప్రభుత్వమేనని,

ఇందిరమ్మ రాజ్యంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని' ప్రజలకు భరోసా ఇచ్చారు. ముఖ్యంగా ఆదివాసీలు తమకు భూమి లేదని, నీళ్లు రావడం లేదని, ఇళ్లు లేవని, రేషన్ కార్డులు వస్తలేవని, ఉద్యోగాలు లేవని, ఇలా తమ గోడు వెల్లబోసుకున్నారు. నెల రోజుల పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగిన పాదయాత్రలో ప్రజల పడుతున్న అరగోసలను ప్రత్యక్ష్యంగా చూసి చలించిన భట్టి విక్రమార్క వాటి పరిష్కారం కొరకు ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలను అధిష్టానంతో ప్రకటన చేయించండంలో సఫలీకృతం అయ్యారు. పాదయాత్ర తరువాత ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో డిప్యూటి సీఎంగా పదవీ భాద్యతలు చేపట్టిన భట్టి విక్రమార్క ఆర్ధిక, ఇందన, ప్లానింగ్ శాఖలకు మంత్రిగా ఉండటంతో పాదయాత్రలో ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ప్రకటించిన ఆరు గ్యారంటీల హామీల అమలుకు వనరుల సమీకరణపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ప్రజా ప్రభుత్వం అమలు చేసిన రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, రూ.500 గ్యాస్ సిలిండర్, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉచితంగా నెలకు 200 యూనిట్లు ఉచిత కరెంటు సరఫరా తదితర గ్యారంటీల హామీల అమలు భట్టి విక్రమార్క కృషి ఫలితమేనని సాక్ష్యాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాహటంగా చెప్పడమే ఇందుకు నిదర్శనం. ధరణీ ప్రక్షాళలన చేస్తానని ప్రకటించింది ఇక్కడే. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 21/ 3/ 2023 రోజున ఆసిఫాబాద్ నియోజకవర్గం, బూసిమెట్ట గ్రామానికి చేరుకుంది. పాదయాత్ర రథసారధి భట్టి విక్రమార్క కు గ్రామంలో ఆదివాసులు ఘనంగా స్వాగతం పలికి సుమన్ బాయ్ ఇంటి దగ్గర నూలు మంచం వేసి కూర్చోబెట్టి వారు పడుతున్న కష్టాలను ఏకరువు పెట్టారు. బూసి మెట్ట క్యాంపులో 45 కుటుంబాలు 80 మంది రైతులు ఉన్నారని మాకు కేసీఆర్ ప్రభుత్వం క్రాఫ్ లోను, రైతుబంధు, రైతు భీమా ఇవ్వడం లేదు, రుణమాఫీ అమలు కాలేదని, బిఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా బ్యాంకు రుణాలు ఇవ్వకపోగా, గతంలో ఇచ్చిన రుణాలను చెల్లించాలని బ్యాంకు అధికారులు వచ్చి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూమి ఇచ్చి పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారు ఆ భూమిని అటవీ భూమి గా పేర్కొంటూ ధరణిలో ఫారెస్ట్ ఖాతాలో చేర్చి కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వలేదని డాకురే రుక్మిణి భాయ్, సుశీల భాయ్, సుమన్ భాయ్ తమ పాత పాస్ పుస్తకాలను తీసుకువచ్చి భట్టి కి చూపించారు. మాభూమి రికార్డులో లేకుంటే మేము బతికున్న సచ్చినట్టే కదా అంటూ లక్ష్మీబాయి బోరున విలపించడంతో ఆమె కన్నీళ్లను తుడుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణీ ని ప్రక్షాళన చేసి మీ బాధాలు తీరుస్తామని ఆనాడు ప్రకటించారు. అధికారంలోకి రాగానే ధరణీ సమస్యల పరిష్కారం కొసం ప్రజా ప్రభుత్వం ప్రక్షాళనకు కమిటీ వేసిన విషయం విధితమే. టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చేస్తానని ప్రకటించింది ఇక్కడే..పాదయాత్ర ప్రారంభమై ఆరో రోజున ఆసీఫాబాద్ జిల్లా కెరిమెరి మండలం గోయాగాం గ్రామానికి చేరుకుంది. డప్పు వాయిద్యాలు బాణా సంచా పెద్ద ఎత్తున కాలుస్తు గిరజనులు పెద్ద ఎత్తున భట్టి విక్రమార్కకు ఘనంగా స్వాగతం పలికారు. అయితే పాదయాత్ర గ్రామానికి వచ్చే నాటికి బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల గ్రూప్-1 పరీక్ష ప్రశ్న పత్రం లీక్ కావడంతో ఆగ్రామానికి చెందిన షిండే సరస్వతి గుండెల్లో గుది బండ పడ్డట్టు అయ్యింది. క్యాన్సర్‌తో పోరాడుతూ.. కిడ్నీ వ్యాదితో భాదపడుతూ రెక్కలు ముక్కలు చేసుకొని ఆరోగ్యం సహకరించక పోయిన టైలరింగ్ చేస్తూ కూమారుడైన షిండే శుభంను కోచింగ్ కు పంపించానని, ప్రశ్న పత్రం లీక్ కావడంతో ఊరిలోకి వచ్చిన నా కొడుకు గడ్డం పెంచుకొని పిచ్చోడిలా తిరుగుతున్నాడని పాదయాత్ర చేస్తున్న భట్టి దగ్గరికి వచ్చి కన్నీటి పర్యంతమైంది. ప్రభుత్వం మళ్లీ పరీక్షలు పెట్టేనాటికి క్యాన్సర్‌తో ఉన్న నేను బతికి ఉంటనో..? ఉండనో..? నేను చనిపోతే నా కొడుకు భవిష్యత్తు ఎట్లా ఉంటుందో... కొలువు రాకపోతే నా కొడుకు ఎట్లా బతుకుతాడో..? వాడి భవిష్యత్తు తలచుకుంటే గుండె తరుక్కుపోతుందని బోరున విలపించింది. ఆమె దుంఖాన్ని చూసి భట్టి సైతం భావోద్వేగానికి గురయ్యారు. గోయాగాం గ్రామ సాక్షిగా మాట ఇస్తున్న కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ఇందిరమ్మ రాజ్యంలో నిరుద్యోగుల కన్నీళ్లను తుడుస్తాం. వారికి ఉద్యోగాలు ఇవ్వడానికి టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయడమే కాకుండా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే మూడు నెలల్లో 32 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వడమే కాదు, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి అసెంబ్లీ వేదిక సాక్షిగా జాబ్ క్యాలెండర్ ప్రకటించి మాట తప్పనని మడమ తిప్పనని భట్టి విక్రమార్క చాటుకున్నారు. అసెంబ్లీలో భట్టి నోట ఆదిలాబాద్ మాట!ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అన్న, ఇక్కడి గిరిజన, ఆదివాసీలు అన్న కాంగ్రెస్ పార్టీకి, నాకు అత్యంత ఇష్టం. అందుకనే ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ హాయంలో మొదలుపెట్టిన మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఆదిలాబాద్ జిల్లా వాసులంద రికీ ఈ సభ ద్వారా సందేశం పంపుతున్నా.. మీకు కావాల్సిన అన్ని కార్యక్రమాలు చేపడతాం. తుమ్మిడిహెట్టి, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులు మొదలుపెడతాం. చనాక-కొరట ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం. కుప్టీ, త్రివేణి సంగమం, పులిమడుగు వాగు, గొల్లవాగు, చిక్మాన్ ప్రాజెక్టులకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాం.. వాటన్నింటిని పూర్తి చేస్తాం..' అని ఉప ముఖ్యమం త్రి మల్లు భట్టి విక్రమార్క గత 27న అసెంబ్లీ సమావేశాల్లో ప్రసంగిస్తూ ఆదిలాబాద్ జిల్లాను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఐటీడీఏ ఒకప్పుడు అద్భుతంగా పని చేసిందన్నారు. ప్రస్తుతం నిర్వీర్యమైనటువంటి ఐటీడీఏ కోసం సబ్ ప్లాన్ నిధులు పరిపుష్టిగా పెట్టామని చెప్పారు. గిరిజన సోదరులు హమ్మయ్య కాంగ్రెస్ పార్టీ వచ్చింది.. మళ్లీ మాకు బతుకు వచ్చిందని ఆనంద పడేలా చేస్తామని భట్టి ప్రకటించారు. అయితే తొలిసారిగా పాదయాత్ర చేసిన గ్రామానికి నేడు విక్రమార్క వస్తోన్న వరాల జల్లులు కురిపిస్తాడని ఆదిలాబాద్ జిల్లా వాసులు గంపేడాశలు పెట్టుకున్నారు.

**పిప్పిరిలో పర్యటన సాగుతుందీ ఇలా.....**

డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క పిప్పిరి గ్రామానికి బుధ వారం ప్రజాభవన్ నుంచి బయలుదేరి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో చేరుకుంటారు. ఉదయం 11.30 గంటలకు పిప్పిరి గ్రామానికి చేరుకునే డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కకు జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్‌పి, ఉన్నత అధికారులు స్వాగతం పలుకుతారు. కొద్ది సేపు అధికారులతో జిల్లా అభివృద్ధి పురోగతి, అమలవుతున్న పథకాలు, సంక్షేమం గురించి సమీక్షిస్తారు. ఆ తరువాత ఎస్టీఎస్‌డిఎఫ్ రూ.15 కోట్లతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

ఆనంతరం రూ.2 కోట్లతో వాంకిడి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారు. రూ.3.5 కోట్లతో పిప్పిరి గ్రామాంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఆనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు. సభ ముగిసిన తరువాత ఎస్సీ కార్పోరేషన్, ట్రైకార్, ఐటీడీఏల ద్వారా మంజూరైన బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేస్తారు. ఆతరువాత హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.



## జర్నలిస్టులకు గుర్తింపు కార్డుల నిరాకరణ చెల్లదు

### అక్రిడిటేషన్ రూల్స్‌లో కొంత భాగాన్ని కొట్టేసిన హైకోర్టు..

హైదరాబాద్ : చిన్న పత్రికల్లో పని చేసే జిల్లా, నియోజక వర్గ స్థాయి జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ (ప్రభుత్వ గుర్తింపు కార్డు) ఇవ్వకుండా దూరం పెట్టడం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది..ఈ మేరకు తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ - 2016 లోని షెడ్యూల్ 'ఈ' ని కొట్టేస్తూ తాజాగా తీర్పు ఇచ్చింది.. చిన్న వార్తా పత్రికలను నాలుగు విభాగాలుగా విభజించడం చెల్లదని పేర్కొంది. 2016లో జీవో 239 ద్వారా అప్పటి ప్రభుత్వం పెట్టిన నిబంధనలను సవాల్ చేస్తూ మహబూబ్ నగర్‌కు చెందిన తాటికొండ కృష్ణ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే. శ్రీనివాస రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. 'చిన్న పత్రికల్లో పని చేసే జర్నలిస్టులను ఏ,బీ,సీ,డీ కేటగిరీలుగా ఎందుకు విభజించారో సరైన వివరణ లేదు.. తగిన వివరణ, సమర్థన లేకుండా మిగతా వారితో సమానంగా గుర్తింపు కార్డులు ఇవ్వక పోవడం చెల్లదు. రెండు నెలల్లో పారదర్శక, హేతుబద్ధమైన ప్రాతిపదికన మార్గదర్శకాలు రూపొందించాలి' అని ఆదేశించింది..

### నేడు అమెరికా పర్యటనకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్ :ఈ నెల 7వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రవాస భారతీయ లీడర్లతో జరిగే మీట్ అండ్ గ్రీట్‌లి కార్యక్రమంలో పాల్గొంటారు. బేరింగ్ ఇతర రిపేర్లతో ఆలస్యం అవుతున్న ఎస్.ఎల్.బి.సి టన్నెల్ తవ్వకాన్ని వేగవంతం చేసేందుకు అధునాతన బేరింగ్ మెషినరీ సమకూర్చేందుకు అమెరికా వెళ్తున్న మంత్రి. ఈ నెల 12న తేదీన.. ఓహియోలోని రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ మ్యాన్ ఫ్యాక్చరింగ్ కంపెనీ సీఈఓ లాక్ హోమ్ తో సమావేశంకానున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

### షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చేందుకు నిరాకరించిన బ్రిటన్?

న్యూఢిల్లీ ఆగష్టు 6 : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చేందుకు బ్రిటన్ నిరాకరించిందని సమాచారం. ప్రస్తుతం ఆమె భారత్ లో ఉన్నారు. ఇమ్మిగ్రేషన్ చట్టాల ప్రకారం హసీనాకు ఆశ్రయం కల్పించడం కష్టతరమని బ్రిటన్ తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో హసీనా ఇక కొంత కాలం భారత్ లోనే ఉండనున్నారు.

బంగ్లాదేశ్ లో రిజర్వేషన్ల కోటా తీవ్ర ఘర్షణలకు దారితీసింది. అయినా ముస్లింలంతా ఒక్కటే అనే దేశంలో రిజర్వేషన్ల రచ్చ ఏమిటో?

## అర్హులు అందరికి ఇందిరమ్మ ఇళ్లు.. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

- హుజూర్ నగర్ పట్టణంలోని హౌసింగ్ కాలనీని పరిశీలించిన మంత్రి ఉత్తమ్
- హుజూర్‌నగర్ కాలనీలో 2,160 గృహాలు 3 నెలల్లో పంపిణీ..
- కేసీఆర్ డబుల్ బెడ్రూం పథకం ఒక అభూత కల్పన.



హైదరాబాద్, ఆగస్టు 6: తెలంగాణలో వచ్చే ఐదేళ్లలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని రామస్వామి గుట్టలోని హౌసింగ్ కాలనీని పరిశీలించిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా హౌసింగ్ రంగాన్ని గత బీఆర్ఎస్ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. 2 %దీఎఖ% హౌసింగ్ స్కీమ్ చుట్టూ ఒక హైప్ క్రియేట్ చేయబడిందని, వాస్తవానికి అది ఒక అభూత కల్పన మరియు బోలు వాగ్దానం అని నిరూపించబడింది. కెసిఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ఇళు లేని ప్రజలను మోసం చేసిందని, వాటిని పంపిణీ చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన బలహీన వర్గాల ఇళ్ల ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం నిలిపివేసింది. హుజూర్‌నగర్ పట్టణంలో 2,160 యూనిట్లతో ఇందిరమ్మ ఇళ్ల ప్రాజెక్టును 2013-14లో తాను కాంగ్రెస్ ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన విషయాన్ని ఉత్తమ్‌కుమార్ రెడ్డి గుర్తు చేశారు. "బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 10 సంవత్సరాలు ఆపేసిందని, . 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే, నేను ప్రాజెక్టులను పునరుద్ధరించి, పనులను వేగవంతం చేసానని అవి ఇప్పుడు అధునాతన దశలో ఉన్నాయని అన్నారు వచ్చే మూడు నెలల్లో 2,160 యూనిట్లను నిరాశ్రయులకు అందజేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యతనిస్తోందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ పథకం కింద ఒక్కో నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్ల చొప్పున రూ.22 వేల కోట్లతో మొత్తం 4.5 లక్షల ఇళ్లను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ ఇళ్లు 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆర్‌సిసి రూఫింగ్, వంటగది మరియు టాయిలెట్‌తో ఉంటాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో గృహ నిర్మాణ పథకానికి రూ.7,740 కోట్లు కేటాయించారు. ఇంకా, భూమిని కలిగి ఉన్న అర్హులైన వ్యక్తులకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించబడుతుందని అన్నారు, షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల వర్గాలకు చెందిన వ్యక్తులు రూ. 6 లక్షలు అందుకుంటారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) వంటి కేంద్ర గృహ నిర్మాణ పథకాల్లో కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్, బీజేపీలకు భిన్నంగా కాంగ్రెస్ వైఖరి ఉందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రచారంపైనే దృష్టి సారిస్తుండగా, కాంగ్రెస్ మాత్రం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తుందని విశ్వసిస్తోంది. ఈ కారణంగానే లక్ష్యాల సాధనకు స్పష్టమైన గడువు విధించడంతో పాటు ప్రతి హామీని నెరవేర్చేందుకు తగినన్ని బడ్జెట్ కేటాయింపులు చేశామన్నారు. అనంతరం హుజూర్ నగర్ పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ, ఐటీఐ కళాశాల ఏటీసీ సెంటర్ వర్క్‌షాప్ శంకుస్థాపన, క్రిస్టియన్ శ్మశాన వాటిక పనుల పరిశీలన, టౌన్‌హాల్, 100 పడకల ప్రభుత్వాసుపత్రి, భవన నిర్మాణ పనులను పరిశీలించారు. స్టేడియం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో టీయూఎఫ్‌ఐడీసీ పనులకు శంకుస్థాపన చేశారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పురస్కరించుకుని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు న్యాయ, రాజకీయ పోరాటంలో విశేష సహకారం అందించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు.

# సంపాదకీయం

## అణుశక్తితో శాంతి కపోతాలను ఎగిరేద్దాం!

ప్రపంచ శాంతి పునాదిగా, ప్రపంచ కుగ్రామ సమగ్రాభివృద్ధికి ఊతం ఇచ్చేవిగా శక్తి వనరులు ఉండాలి. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 06 ఆగష్టు 1945న ఉదయం 8:15 గంటల సమయంలో 'మాన్‌హట్టన్ ప్రాజెక్ట్' రూపంలో అమెరికా బి–29 బాంబర్ సహాయంతో ప్రయోగించిన 'లిటిల్ బాయ్' అనబడే 5 టన్నుల ఆటమ్ బాంబు తాకిడికి జపాన్‌లోకి పారిశ్రామిక, మిలిటరీ కేంద్రమైన 'హిరోషిమ' నగరం నేలమట్టం కావడం మానవాళి చరిత్రలో చీకటి ఘటనగా నిలుస్తున్నది. మూడు రోజుల అనంతరం 09 ఆగష్టున సముద్రతీర పారిశ్రామిక, మిలిటరీ 'నాగసాకి' నగరంపై మరో ఆటమ్ బాంబు వేయడంతో జరిగిన మానవ, ఆస్తి విధ్వంసం అంచనాలకు అందనంత అధికంగా నమోదు అయ్యింది. ఈ ఆటమ్ బాంబుల తాకిడికి 3.5 లక్షల వరకు అమాయక జపనీయులు మరణించగా, 35,000లకు పైగా గాయపడడం, 60,000లకు పైగా క్షతగాత్రులు రేడియేషన్, తీవ్రంగా కాలిన గాయాలతో నరకం అనుభవించారు. హిరోషిమ నగరం దాదాపు 70 శాతం పైగా నేలమట్టం కావడంతో ప్రపంచానికి అణుశక్తి తీవ్రత ఎంత ఉంటుందో అప్పుడు అర్థం అయ్యింది. నగరంలోని 90,000 భవనాల్లో దాదాపు 65,000 భవనాలు నేలమట్టం అయ్యాయని తెలుస్తున్నది. నాగసాకి నగరంపై 09 ఆగష్టు 1945న ప్రయోగించిన 'ఫాట్ మ్యాన్' ఆటమ్ బాంబు విధ్వంసంతో జపాన్ ఓటమిని అంగీకరించడం, ప్రపంచ యుద్ధం–2 కొద్ది రోజుల్లోనే ముగిసిపేవడం వెంట వెంటనే జరిగి పోయాయి. 06 ఆగష్టు 2021 రోజున ప్రపంచ దేశాలు 76వ 'హిరోషిమ దినం' పాటిస్తూ, అణు పరమాణు శక్తులను మానవాళి శాంతి సంక్షేమాలకు మాత్రమే వాడాలని, విధ్వంసం కోసం దుర్వినియోగం చేయవద్దంటూ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఈ రోజున హిరోషిమ నరగంలోని 'శాంతి వనం'లో ప్రధాన కార్యక్రమం నిర్వహిస్తారు. నాటి ఆటమ్ బాంబు దెబ్బకు నేటికీ కోలుకోని జపనీయులు కసితో శాంతియుత మార్గాల్లో అభివృద్ధి దిశగా పయనించడం, అగ్ర రాజ్యంగా నిలవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తూనే, ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. అణుశక్తిని విధ్వంసం కోసం వాడవద్దంటూ ప్రచారం నిర్వహించే సమయం ఆసన్నమైంది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జర్మనీ ఓటమిని అంగీకరించినప్పటికీ జపాన్ పోరాటం చేయడానికే నిర్ణయించడంతో, జపాన్‌ను ఓడించడానికి అమెరికా పన్నిన కుయుక్తిగా ఆటమ్ బాంబు ప్రయోగం జరిగిందని తెలుస్తున్నది. నేడు ఆధునిక డిజిటల్ అందాలు అద్దుకున్న జపాన్‌లో 1945 కాలపు రెండవ ప్రపంచ యుద్ధం మిగిల్చిన మానని గాయాలు, చేదు అనుభవాలు గుర్తుకు వస్తున్నాయి. 06 ఆగష్టు రోజున 'హిరోషిమ దినం' రోజున కనీసం ఒక నిమిషం నిశ్శబ్దం పాటిస్తూ, ప్రాణాలు కోల్పోయిన అమాయకుల ఆత్మకు శాంతి కలిగించే ప్రయత్నం చేయాలని విజ్ఞులు అంటున్నారు. ఇలాంటి అణు బాంబు ప్రయోగాల ఫలితంగా ప్రచ్ఛన్న యుద్ధాలకు బీజాలు పడ్డాయనడంలో అతిశయోక్తి లేదు. అణ్వాయుధాలను వినాశనానికి వాడకూడదనే నినాదంతో ప్రతి ఏట 29 ఆగష్టున 'అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినం' పాటించాలని ఐరాస తీర్మానించడం హర్షదాయకం. హిరోషిమ దినాన్ని మరో విధంగా 'ఆంటీ–న్యూక్లియర్ దినం' లేదా 'హిరోషిమ శాంతి దినం'గా కూడా పిలవడం అర్థవంతంగా ఉన్నది. ప్రపంచ దేశాలు గెలుపోటములు, ఆదిపత్య ధోరిణిలు పక్కన పెట్టి శాంతి స్థాపన దిశగా ఆలోచనలు, ఆచరణాత్మక, సర్వ మానవ అంగీకార అడుగులు వేయాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది.

## తెలంగాణ ఏర్పాటులో సుష్మా పాత్ర



తెలంగాణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడంలో సుష్మా స్వరాజ్ కీలకపాత్ర పోషించారు. ఆమె జన్మదిన సందర్భంగా సుష్మా పాత్ర గురించి ఒక్కసారి మననం చేసుకుందాం. 2014 ఫిబ్రవరి 18వ తేదీ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన రోజు. తెలంగాణ బిల్లుకు సభలో మూడింట రెండొంతుల మెజార్టీ కావాలి. దీనికి ఓటింగ్ కూడా జరపాల్సి ఉంటుంది. దీంతో సెక్రటరీ జనరల్ నిబంధనలు వివరిస్తూ.. సభకు నిరాటంకంగా అంతరాయాలు కలుగుతున్నప్పుడు, అధికార, ప్రతిపక్ష పార్టీలు అంగీకరిస్తే హెడ్ కౌంట్ (ఎంపీలను నిలబెట్టి, లెక్కించడం) సరిపోతుందని చెప్పారు. దీంతో సుష్మా స్వరాజ్ నిర్ణయం కీలకమైంది. ఆమె అంగీకరిస్తేనే స్పీకర్ మీరాకుమార్ ఈ పద్ధతికి ఒప్పుకునేలా కనిపించారు. సుష్మా స్వరాజ్ దానికి అంగీకరించారు. 'మీరు బిల్లు పెట్టండి. నేను లేచి నిలబడి మాట్లాడతాను. తర్వాత హోం మంత్రిని ఒక్కొక్క క్లాజు చదువుకుంటూ వెళ్లమనండి. అలాగే ఓటింగ్ కూడా పెట్టండి' అని సూచించారు. దీనికి అంతా అంగీకరించారు. లోక్‌సభలో తెలంగాణ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకురాలి హోదాలో సుష్మా స్వరాజ్ ప్రసంగించగా, కాంగ్రెస్ పార్టీ తరపున జైపాల్ రెడ్డి ప్రసంగించారు. బిల్లును ప్రవేశపెట్టిన హోం మంత్రి సుశీల్ కుమార్ షిండేతో కలిపి చర్చలో ప్రసంగించింది మొత్తం ముగ్గురు మాత్రమే. ఈ సందర్భంగా ఆ నాడు తెలంగాణ బిల్లపై సుష్మా స్వరాజ్ ప్రసంగం ఇలా ఉంది..'ధన్యవాదాలు అధ్యక్ష జీ. ఆంధ్రప్రదేశ్ పునర్‌నిర్మాణ బిల్లును ఆమోదం కోసం ఇప్పుడే హోం మంత్రి ప్రవేశపెట్టారు. మా పార్టీ తరపు నుంచి ఆ బిల్లుకు మద్దతు ఇచ్చేందుకు నేను నిలబడ్డాను. ఈ బిల్లుకు మేం మద్దతు ఇవ్వటమే కాదు. ఇది పాసయ్యేలా ఓట్లు కూడా వేస్తాం. ఎందుకంటే ఇది మా విశ్వసనీయతతో ముడిపడిన విషయం. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటుకు బిల్లును తీసుకొస్తే, బీజేపీ మద్దతు ఇచ్చి దాన్ని ఆమోదించేలా చేస్తుందని పార్లమెంటు బయట, పార్లమెంటు లోపల, తెలంగాణలోను, తెలంగాణ వెలుపల కూడా మేం ఎన్నోసార్లు డిమాండ్ చేశాం. అంతే కాదు, ఒకవేళ కేంద్ర ప్రభుత్వం కనుక బిల్లును తీసుకురాకపోతే, మా ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో తెలంగాణను ఏర్పాటు చేస్తాం అని కూడా హామీ ఇచ్చాం. అధ్యక్ష జీ.. మీరే సాక్షి. మీరు ఇదే స్థానంలో కూర్చున్నారు. నేను ఇక్కడి నుంచే మాట్లాడాను. తెలంగాణ కోసం ఆత్మాహుతి చేసుకుంటున్న పిల్లలకు విజ్ఞప్తి చేస్తూ తెలుగులో చెప్పాను. 'తెలంగాణ కోసం బలిదానం వద్దు. తెలంగాణ చూడటానికి బతకాలి. బతకాలి' అని. ఇప్పుడు ఈ బిల్లు వారి స్వప్నాలను సాకారం చేసేందుకు వచ్చింది. ఇప్పుడు దీన్ని వ్యతిరేకించి ఆ పిల్లల పట్ల విశ్వాస ఘాతుకానికి ఎలా పాల్పడతాం? కాబట్టే, మొత్తం విపక్షాలన్నీ వ్యతిరేకిస్తున్నప్పటికీ మేం నిలబడి ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. ఎందుకంటే తెలంగాణ ఏర్పడాలన్న ఆ పిల్లల స్వప్నం నిజం కావాలని. నేను కొన్ని విషయాలను రికార్డుల్లోకి తీసుకు రావాలను కుంటున్నాను. నా తొలి ఫిర్యాదు కాంగ్రెస్ అధిష్టానంపైన. సోనియా జీ నావైపు చూడటం లేదు. కానీ, ఆమె సభలోనే ఉన్నారు. నా తొలి ఫిర్యాదు మీమీదే సోనియా జీ. తెలంగాణ ఇస్తామని 2004లో మీరు వాగ్దానం చేశారు. 2014 వచ్చింది. మీ ప్రభుత్వం తొలి దఫా (2004–2009)లో ఏమీ చేయలేదు. రెండో దఫా (2009–2014)లో సైతం, 15వ లోక్‌సభ చివరి సమావేశం, చివరి వారంలో మీరు బిల్లును తీసుకొచ్చారు. 21వ తేదీన సమావేశాలు ముగుస్తాయి. ఈరోజు 18. కేవలం మూడు రోజులే మిగిలి ఉన్నాయి. మీరు విషయాన్ని లాగుతూ, లాగుతూ.. ఇక్కడి దాకా తీసుకొచ్చారు. ఎలా తీసుకొచ్చారంటే.. మీ పార్టీ వాళ్లు కూడా దీన్ని అంగీకరించట్లేదు. మీరు మీ పార్టీ వాళ్లనే ఒప్పించలేక పోయారు, మీరు మీ మంత్రులనే ఒప్పించలేక పోయారు, మీరు మీ ముఖ్యమంత్రిని కూడా ఒప్పించలేక పోయారు. అధ్యక్ష జీ, ఏ సభా ఇలాంటి దృశ్యం చూసి ఉండదు. ప్రధానమంత్రి సభలో కూర్చుని ఉన్నారు. ఆయన మంత్రిమండలి లోని సభ్యుడు వెల్‌లో నిలబడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సభలో కూర్చుని ఉన్నారు. అయినా ఫర్వాలేదంటూ ఆ పార్టీ సభ్యులు వెల్‌లోకి వచ్చి నిలబడ్డారు. ఆ పార్టీ ముఖ్యమంత్రి ధర్నాలో కూర్చున్నారు. ప్రధానమంత్రి క్యాబినెట్‌లో బిల్లును ఆమోదిస్తే.. వాళ్ల ముఖ్యమంత్రి దాన్ని వ్యతిరేకించి వెనక్కి పంపించారు. ఇలాంటి దృశ్యాలను ఈ సభలో చూస్తున్నాం. అధ్యక్ష జీ మేం కూడా మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేశాం. అద్వాణీ ఇప్పుడు సభలో లేరు. కానీ, అప్పుడు ఆయన హోం శాఖ మంత్రి. ఆయన హయాంలోనే మూడు రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. ఒక్క రక్తపు చుక్క కూడా చిందలేదు. ఒక్క క్షణం కూడా సభలో అశాంతి లేదు. పూర్తి శాంతి, ఉత్సాహాలతో మూడు రాష్ట్రాల ఏర్పాటు జరిగింది. మూడు రాష్ట్రాలూ ఇప్పుడు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. ఇప్పుడు పార్టీలన్నీ విడిపోయాయి, సీమాంధ్ర, తెలంగాణ నాయకులు ఒకచోట కూర్చోవడం లేదు, నామా నాగేశ్వరరావు ఉన్నారు. ఆయన్ను నేను శాండ్ విచ్ అంటుంటాను. తెలంగాణ ప్రజలతో కలసి వస్తుంటారు. తెలంగాణను వ్యతిరేకించే వారితో కూడా కలసి వస్తుంటారు. కాంగ్రెస్ పార్టీది కూడా ఇదే పరిస్థితి. జగన్ పార్టీ పరిస్థితి కూడా ఇదే. అన్ని పార్టీలూ విడిపోయాయి." "నేను గర్వంగా చెప్పగలను.. ఇప్పుడు కూడా బీజేపీ సీమాంధ్ర, తెలంగాణ నాయకులు మాత్రం కలసికట్టుగా కూర్చుని, సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు. బీజేపీ సీమాంధ్ర నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు.. తెలంగాణ ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ కూడా తెలంగాణకే చెందాలి. కానీ, మాకు కూడా న్యాయం చేయండి' అని. న్యాయం కోసం వాళు ఏం కోరుకుంటున్నారు? హైదరాబాద్‌లో రూ.1500 కోట్ల మిగులు ఆదాయం ఉంటే దాంతో తెలంగాణకు మేలు జరుగుతుంది. మరి కోస్తాంధ్ర, రాయలసీమకు జరిగే నష్టాన్ని ఎవరు పూడ్చుతారు? దాన్ని కేంద్ర ప్రభుత్వమే పూడ్చాలి. హోం మంత్రి హామీతో ఇది నెరవేరదు. నిధులు ఇచ్చే ఏర్పాటు చేయండి. వారి నష్టాన్ని పూడ్చే మాట చెప్పండి. మరోమాట వారు చెబుతున్నారు. హైదరాబాద్‌లో 148 సంస్థలు ఉన్నాయి, పదేళ్లపాటు అది సంయుక్త రాజధాని. కానీ, సీమాంధ్రలో ఏర్పాటు కావాల్సిన సంస్థలకు సూత్రప్రాయంగా ప్రణాళికా సంఘం నుంచి అనుమతి ఇవ్వండి. వాటికి టోకెన్ అమౌంట్‌గా కొంత నిధులు ఇవ్వండి. మధ్యంతర బడ్జెట్ రూపంలో వాటిని నిధులు సమకూర్చండి. వారు చెబుతున్న మూడో మాట.. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అంటున్నారు. దానికోసం మండలాల బదిలీ జరగాల్సి ఉంది. దీనిపై వెంకయ్య నాయుడు సమక్షంలో వారి మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు జైరామ్ రమేశ్ లేఖ మా వద్ద ఉంది. కానీ, దీన్ని క్యాబినెట్‌లో మార్చేశారు. ఒప్పందం ప్రకారం వాటిని బదిలీ చేయండి. అందుకే అధ్యక్ష జీ.. తెలంగాణ ఏర్పాటు కావాలి. హైదరాబాద్ కూడా తెలంగాణలోనే ఉండాలి. అయితే, సీమాంధ్ర వారికి కూడా న్యాయం జరగాలి. అందుకే ఇవన్నీ బిల్లులో ఉండాలి. ఇది నా కోరిక. ఈ బిల్లులో గవర్నర్‌కు అధికారాలను కట్టబెట్టారు. ఇలాంటి శక్తులు ఇవ్వాలంటే రాజ్యాంగాన్ని మార్చాల్సి ఉంటుంది. సాధారణ బిల్లుతో పాటు రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీసుకొస్తే మేం మద్దతు ఇస్తామని ప్రభుత్వానికి చెప్పాం. లోపాల బిల్లు తీసుకురావొద్దు.. అసలైన బిల్లు తీసుకురండి అని చెప్పాం. ఈ బిల్లు ఆమోదం పొందగానే బయటకు వెళ్లి పాటలు పాడతారు. "కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది. సోనియా అమ్మ తెలంగాణ ఇచ్చింది" అంటారు. సోనియా అమ్మను గుర్తుంచుకుంటే.. ఈ చిన్నమ్మను కూడా గుర్తుంచుకోండి. తెలంగాణకు మద్దతు ఇస్తామని మా పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు కాబట్టి, జన చేతన యాత్రలో మా సీనియర్ నాయకుడు అద్వాణీ మాట ఇచ్చారు. కాబట్టి మేం ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. మా విశ్వసనీయత కోసం మద్దతు ఇస్తున్నాం. ఏ రాజకీయ పార్టీకైనా, నాయకుడికైనా విశ్వసనీయతే ముఖ్యం. మనం ఏదైనా చెబితే ఎదుటివాళ్లు దానిపై నమ్మకం ఉంచాలి. అందుకే మేం ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. హోం మంత్రి సమాధానం ఇచ్చేప్పుడు సీమాంధ్రకు న్యాయం చేయాలని నేను చెప్పినవన్నీ ఈ బిల్లులో పెట్టాలని నేను కోరుతున్నాను. అలా సీమాంధ్రులు కూడా సంతోషిస్తారు. ఒకవేళ అలా చేయకుంటే.. రాబోయే ప్రభుత్వం మాదే. మేం న్యాయం చేస్తాం అని నేను ఇక్కడ నిలబడి చెబుతున్నాను. సీమాంధ్రవాళ్లూ.. బాధపడకండి. మీ భద్రతకు మాది పూచీ. ఈ హామీ ఇస్తూ నేను ఈ బిల్లుకు మద్దతు పలుకుతున్నాను. ఈ బిల్లు ఆమోదానికి మద్దతు తెలుపుతున్నాను. ధన్యవాదాలు." బిల్లు ఆమోదం పొందిన తర్వాత పార్లమెంటు భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుష్మా స్వరాజ్ మాట్లాడుతూ, "బిల్లును సభలో పెట్టాలి. కానీ, అది ఆమోదం పొందకూడదు. దీనికి కారణం బీజేపీనే అని నిందించాలి. బిల్లు పెట్టడం ద్వారా తెలంగాణ వారిని, దాన్ని ఆమోదించకుండా సీమాంధ్ర వారిని సంతృప్తిపర్చాలి'. ఇదే కాంగ్రెస్ ప్లాన్. ఇది మాకు స్పష్టంగా అర్థమయ్యింది. దీంతో సభలో ఆందోళనలు జరుగుతున్నా సరే మేం బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. అందుకే మేం మా వైఖరిని మార్చుకున్నాం. బిల్లుకు మద్దతు ఇచ్చాం' అని చెప్పారు.

## యాచక దశ నుండి తెలంగాణ శాసక దశకు రావాలి



తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ (ఆగష్టు 6, 1934– జూన్ 21, 2011) వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామ శివారు అక్కంపేటలో జన్మించారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్ డీ పట్టా పొంది, ప్రిన్సిపాల్ గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్– ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పేవారు. జయశంకర్ 2011, జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు. 1934, ఆగస్టు 6న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట లో జయశంకర్ జన్మించారు. తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత రావు. ఆయనకు ముగ్గురు అన్న దమ్ములు, ముగ్గురు అక్క చెల్లెళ్లు. జయశంకర్ తల్లిదండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించు కోకుండా, తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి, ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలి పోయారు. బెనారస్, అలీగఢ్ విశ్వ విద్యాలయాల నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్ డీ చేశారు. 1975 నుంచి 1979 వరకు వరంగల్ లోని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేశారు. 1979 నుంచి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్ 1991 నుంచి 1994 వరకు ఆదే యూనివర్శిటీకి ఉప కులపతిగా పని చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1952 లో జయశంకర్ నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకునిగా 1954 లో ఫజల్ అలీ కమిషన్ కు నివేదిక ఇచ్చారు. కె.సి.ఆర్ కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాశారు. తెలంగాణ లోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశారు. జయశంకర్ తన ఆ ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారు. "అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్నా బెర్ మర్దనా" (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి. తర్వాత మరణించాలి అని అనేవారు. తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా విదేశాల్లో సైతం వ్యాప్తి చేయడంలో ఆయన పాత్ర మరవ లేనిది. ఆచార్య జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారు. 1952 నాన్ ముల్కీ, ఉద్యమం లోకి ఉరికి ఆనాటి నుంచి సమరశీల పాత్రను పోషించాడు. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన అపర మేధావి కొత్తపల్లి జయశంకర్. అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి, ఆచరించిన మహనీయులు. తెలంగాణ డిమాండ్ ను 1969 నుంచి నిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసిన మేధావి ఆయన. తెలంగాణ లోని ప్రతీపల్లె ఆయన మాటతో పోరాట గళాన్ని అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద , విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినింపించిన పోరాట యోధులు. "మా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసక దశకు తెలంగాణ రావాలి! మా తెలంగాణ మాగ్గావాలి..!! యాభై ఏళ్లుగా ఇదే ఆకాంక్ష.. ఇదే శ్వాస.. ఇదే లక్ష్యం... ఇదే జీవితం.. ఇందులోనే మరణం!" అని ఉద్యమాన్ని శ్వాసించిన మహోపాధ్యాయుడు ప్రొఫెసర్ కొత్త పల్లి జయశంకర్, రెండేళ్లు గొంతు క్యాన్సర్ తో బాధపడ్డారు. మీరు చేయాల్సింది మీరు చేశారు. ఈ సమయంలో నేను ఇక్కడ ఇక ఉండలేను. నేను వరంగల్ కు పోతాను. నన్ను పంపండి' అంటూ ఆయన పుట్టిన గడ్డమీద మమకారంతో వరంగల్ వచ్చారు. ఇంట్లోనే వైద్యులు ఆయనకు అన్నిరకాల వైద్యసేవలు అందించారు. 2011 జూన్ 6 మంగళవారం రోజున తెల్లవారు జాము నుంచి ఆయన పల్స్ రేట్ పడిపోవడంతో ఆక్సిజన్ అందించారు. చివరకు అదేరోజు ఉదయం 11.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాలకు ప్రిన్సిపల్ గా పనిచేశారు. సీకేఎం కళాశాల అంటేనే, జిల్లాలో "విప్లవ విద్యార్థి ఉద్యమానికి" కేంద్రంగా అప్పట్లో పేరుండేంది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమర్జెన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి, ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తు పెట్టుకోవడం సర్వసాధారణమే కానీ, ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని, పేరు పెట్టి పిలవడం, ఒక్క జయశంకర్ సార్ కు సాధ్యం అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రముఖ సాహితివేత్త రామశాస్త్రి చెప్పేవారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశ విదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, ప్రొఫెసర్ కే. సీతా రామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్.

# బంగ్లాదేశ్ ఎయిర్‌క్రాఫ్ట్ కలకలం

పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో భారత గగనతలంలోకి ఆ దేశ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రవేశించడం కలకలం రేపింది. బంగ్లాదేశ్ వాయుసేనకు చెందిన %జ%-130 ఎయిర్‌క్రాఫ్ట్ భారత గగనతలంలోకి ప్రవేశించింది. ఆ వెంటనే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అప్రమత్తమైంది.
పరిస్థితిని పరిశీలించేందుకు వాయుసేనకు చెందిన ఓ యుద్ధ విమానాన్ని పంపింది. ఈ యుద్ధ విమానం.. బంగ్లాదేశ్ ఎయిర్‌క్రాఫ్ట్ తిరిగి ఆ దేశ ఎయిర్‌స్పేస్‌లోకి వెళ్లేవరకు ఓ కన్నేసి ఉంచింది. కాగా, బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం నేపథ్యంలో భారత్‌లో ఎలాంటి పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని భారత వాయుసేన వర్గాలు తెలిపాయి.

**భారత్ - బంగ్లా సరిహద్దుల్లో హైఅలర్ట్.. అదనపు బలగాలను మోహరిస్తున్న బీఎస్‌ఎఫ్**

ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్ లో తీవ్ర అల్లర్లకు కారణమైంది. ఇప్పటికే ఆ దేశంలో వందల సంఖ్యలో నిరసనకారులు మృతి చెందారు. ఆదివారం ఒక్క రోజే పోలీసులు జరిపిన కాల్పుల్లో 100 మంది నిరసనకారులు చనిపోయారు. దీంతో ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి. షేక్ హసీనా రాజీనామా చేయాలని నిరసనకారులు పిలుపునిచ్చారు. దేశం అట్టుడుకుతున్న వేళ.. సోమవారం మధ్యాహ్నం ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా సమర్పించారు. అనంతరం రక్షణ నిమిత్తం ఆమె సీ-130 మిలటరీ విమానంలో భారత్‌కి పయనమయ్యారు. కాగా పొరుగుదేశంలో ఉద్రికత్తల నడుమ భారత్ కూడా అప్రమత్తం అయింది. షేక్ హసీనా భారత్‌కి వస్తున్నారని తెలుసుకున్న నిరసనకారులు మన దేశంలోకి ప్రవేశించే ప్రమాదం ఉండటంతో భారత్- బంగ్లా సరిహద్దులో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ హైఅలర్ట్ ప్రకటించింది.ల దాదాపు 4,096 కిలోమీటర్ల మేర ఉన్న భారత్- బంగ్లా సరిహద్దులో అదనపు బలగాలను వెంటనే మోహరించాలని బీఎస్‌ఎఫ్ అధికారులను ఆదేశించింది. అందరూ కమాండర్లు బార్డర్లోనే ఉండాలని సూచించింది. బంగ్లాదేశ్‌లో హింస పెచ్చుమీరుతున్న వేళ, సైన్యం ప్రభుత్వ బాధ్యతలు చేపట్టడంతో నిరసనకారులు



భారత్‌లోకి వచ్చే అవకాశం ఉందని అందుకే ఈ చర్యలు చేపట్టినట్లు బీఎస్‌ఎఫ్ తెలిపింది. ఎలాంటి పరిస్థితులైనా తట్టుకునేందుకు సైన్యం సిద్ధంగా ఉందని బీఎస్‌ఎఫ్ స్పష్టం చేసింది. ఈ క్రమంలో కూచ్‌బెహార్, పెట్రాపోల్ సరిహద్దుల్లో భద్రత భారీగా పెంచారు. పరిస్థితులను సమీక్షించేందుకు బీఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరి పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాకు చేరుకున్నారు.

**ఢిల్లీలో నల్లటి వస్త్రాలతో నిరసనలు..**

ఓ వైపు బంగ్లాదేశ్‌లో నిరసనలు జరుగుతుండగా.. ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల వ్యవహారం చర్చనీయాంశం అయింది. ఉద్యోగులంతా తమ జేబులకు నల్లటి వస్త్రాలను చుట్టుకుని ఆఫీసులకు వచ్చారు. అయితే ఇది బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాకాండకు వ్యతిరేకంగా నిరసన తెలపడానికా లేదా నిరసనలకు మద్దతు తెలపడానికా అనేది స్పష్టంగా తెలియరాలేదు.

**సైనిక పాలన.. త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం**

షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆ దేశ ఆర్మీ చీఫ్ కీలక ప్రకటన చేశారు. దేశంలో సైనిక పాలన విధిస్తున్నట్టు ప్రకటించారు. శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. దేశంలోని అన్ని పార్టీలతో చర్చించి ఆందోళనలను అదుపులోకి తీసుకొస్తామని వివరించారు. భద్రత కోసం ప్రధానమంత్రి షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిపోయారని, దేశంలో శాంతిని నెలకొల్పేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. బంగ్లాదేశ్‌లో త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది.
బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో భారత్ నుంచి బంగ్లాదేశ్ వెళ్ళే ఎయిర్ ఇండియా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లుఎయిర్ ఇండియా ప్రకటించింది. ప్రయాణికులు సహకరించాలని కోరింది.

## కేజ్రీవాల్‌కి దక్కని ఊరట



**ఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కి షాక్ తగిలింది. ఢిల్లీ హైకోర్టులో ఆయన వేసిన బెయిల్ పిటిషన్‌పై విచారించిన ధర్మాసనం పిటిషన్‌ని కొట్టేసింది. దీంతో బెయిల్‌పై ఆశలు పెట్టుకున్న కేజ్రీవాల్‌కి ఊరట దక్కలేదు. ఈ ఘటనను చట్టవిరుద్ధమైన అరెస్టు అని చెప్పలేమని జస్టిస్ నీనా బన్సల్ కృష్ణతో కూడిన ధర్మాసనం పేర్కొంది. బెయిల్ దరఖాస్తు కోసం కేజ్రీవాల్ ట్రయల్ కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ ఉందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది.
పిటిషన్లో ఏముందంటే..
లిక్కర్ కేసులో అవినీతి జరిగిందంటూ సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హైకోర్టులో పిటిషన్ వేశారు. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, ఎన్ హరిహరన్, రమేష్ గుప్తా వాదనలు వినిపించారు. సీబీఐ తరఫున ఎస్పీపీ సింగ్ హాజరయ్యారు. ఈ పాలసీపై కేజ్రీవాల్‌తోపాటు అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ కూడా సంతకం చేశారని సింఘ్వి వాదించారు. మాజీ ఎల్జీ, బ్యూరోక్రాట్‌లను కూడా నిందితులుగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు మొత్తం కుంభకోణంలో కేజ్రీవాల్ ప్రమేయం ఉందని, అందుకు తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని సింగ్ తెలిపారు. అరెస్టు చట్టవిరుద్ధం కాదని ట్రయల్ కోర్టు ఇప్పటికే నిర్ధారణకు వచ్చిందని ఆయన అన్నారు. కేజ్రీవాల్‌పై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసిందని.. ముఖ్యమంత్రికి బెయిల్‌పై విడుదలయ్యే అర్హత లేదని సింగ్ పేర్కొన్నారు. సహ నిందితులు మనీష్ సిసోదియా, కె కవితపై ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ కోర్టు బెయిల్ నిరాకరించిన విషయాన్ని గుర్తు చేశారు. 'ఇన్సూరెన్స్ అరెస్ట్' అనే పదాన్ని ఉపయోగించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. కేజ్రీవాల్‌కు సీబీఐ ముందస్తు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ ట్రయల్ కోర్టును ఆశ్రయించకుండానే నేరుగా బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. లిక్కర్ స్కాం కేసుల్లోనే ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ప్రస్తుతం తిహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. మేలో, సాధారణ ఎన్నికల దృష్ట్యా జూన్ 01 వరకు సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న ఆయన తిరిగి లొంగిపోయారు.

## విధుల్లో ఉన్న రైల్వే పోలీసులకు.. ట్రావెల్ అథారిటీ లేదా టిక్కెట్ తప్పనిసరి: రైల్వే



**అహ్మదాబాద్:** విధుల్లో ఉన్న ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్పీ), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) సిబ్బందికి తప్పనిసరిగా ట్రావెల్ అథారిటీ లేదా రైలు ప్రయాణానికి టికెట్ కొనుగోలు చేయాలని రైల్వే స్పష్టం చేసింది. కేవలం ఐడీ కార్డు మాత్రమే ఉంటే సరిపోదని పేర్కొంది. అధికారిక విధుల్లో ఉండగా ప్రమాదం జరిగినందున పరిహారం కోరుతూ రైల్వే కానిస్టేబుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. అలాగే సిబ్బందికి డ్యూటీ కార్డ్ పాస్‌లను జారీ చేయడంలో రైల్వే నిర్లక్ష్యంపై మండిపడింది. 2019 నవంబర్ 13న జీఆర్పీ కానిస్టేబుల్ రాజేష్ బగుల్ అధికారిక విధుల కోసం గుజరాత్‌లోని సూరత్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. సూరత్- జామ్‌నగర్ ఇంటర్‌సిటీ రైలులో బరూచ్‌కి తిరిగి వస్తుండగా పాలేజ్ స్టేషన్‌లో పడిపోయాడు. ఎడమ కాలుకు తీవ్ర గాయం కావడంతో మోకాలి పైభాగం వరకు తొలగించారు. దీంతో రైల్వే విధుల్లో ఉన్న తాను ప్రమాదానికి గురయై కాలు కోల్పోయానని, వడ్డీతో సహా రూ.8 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని రైల్వేను రాజేష్ డిమాండ్ చేశాడు. దీని కోసం రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాడు.
కాగా, దిగాలనుకున్న స్టేషన్‌ను దాటిన తర్వాత రైలు దిగేందుకు రాజేష్ ప్రయత్నించడంతో పడిపోయి ఉండవచ్చని రైల్వే వాదించింది. అలాగే రైలులో అధికారిక ప్రయాణాన్ని నిరూపించడంలో అతడు విఫలమయ్యాడని పేర్కొంది. తప్పనిసరిగా ట్రావెల్ అథారిటీ కలిగి ఉండాలని లేదా రైలు ప్రయాణానికి సంబంధించిన టికెట్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో నష్టపరిహారం కోసం అతడు దాఖలు చేసిన పిటిషన్‌ను రైల్వే ట్రిబ్యునల్ కొట్టివేసింది.


## నా రాజీనామా అడిగే నైతిక హక్కు యెడ్యూరప్పకు లేదు



కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి పాలన సాగిస్తోందని, సీఎం సిద్ధరామయ్య తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని.. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత యెడ్యూరప్ప చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడి రగిలించాయి. అయితే ఈ వ్యాఖ్యలను సీఎం సిద్ధరామయ్య తీవ్రంగా ఖండించారు. యెడ్యూరప్పపై ఉన్న కేసుల గురించి గుర్తుచేశారు. తన రాజీనామా అడిగే హక్కు ఆయనకు లేదన్నారు. యెడ్యూరప్ప డిమాండ్‌ను ప్రస్తావించిన మీడియాతో సిద్ధరామయ్య మాట్లాడుతూ.. 'యెడ్యూరప్పపై పోక్సో కేసు ఉంది. ఆయనపై ఎన్ని కేసులు ఉన్నాయో మీకు తెలుసా..? ఆయన రాజకీయాల్లో ఉండవచ్చా..? నా రాజీనామా అడిగేందుకు ఆయనకు ఏ నైతిక హక్కు ఉన్నది..? ఆయనపై చార్జిషీట్ దాఖలైంది. కోర్టు బెయిల్ ఇచ్చింది కాబట్టి ఆయన బయట ఉన్నారు. లేదంటే పోక్సో కేసులో జైల్లో ఉండేవారు.' అని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలోని 21 కేసులపై తాము విచారణకు ఆదేశించామని, ఆదేవిధంగా మిగతా కేసులలో కూడా విచారణకు ఆదేశిస్తామని సిద్ధరామయ్య వెల్లడించారు.

# వయనాడ్ విషాదానికి కారణమదే..

**న్యూఢిల్లీ:** వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి జరిగిన భారీ ఉత్పాతం, ప్రాణనష్టంపై విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ముందస్తు హెచ్చరికలను కేరళ సర్కార్ పట్టించుకోలేదని కేంద్ర అమిత్‌షా ఇటీవల పార్లమెంటులో చేసిన ప్రకటనను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఈ క్రమంలోనే కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సోమవారం నాడు మరో సంచలన ఆరోపణ చేశారు. వయనాడ్‌లో అక్రమ గనుల తవ్వకాలు, జనవాసాల వల్లే అపార ప్రాణనష్టం జరిగిందని తెలిపారు. అక్రమ జనావాసాలకు స్థానిక రాజకీయవేత్తల రక్షణ ఉందని, కనీసం టూరిజం పేరుతో సరైన జోన్లను కూడా వాళ్లు ఏర్పాటు చేయలేదని, ఈ ప్రాంతంలో భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి ఆరోపించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం 'హైలీ సెన్సిటివ్ ఏరియా' అని తెలిపారు. అటవీ శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ సారథ్యంలో తాము ఇప్పటికే ఒక కమిటీ వేశామని, స్థానిక ప్రభుత్వ యంత్రాగం పరిరక్షణలో అక్కడి అక్రమ జనావాసాలున్నాయని, అక్రమ గనుల తవ్వకాలు జరుగుతున్నాయని భూపేందర్ యాదవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు.



**222కు చేరిన మృతులు**

కాగా, వయనాడ్‌లో గత వారం కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో మరణించిన వారి సంఖ్య 222కు చేరింది. వీరిలో 99 మంది పురుషులు, 88 మంది మహిళలు, 37 మంది పిల్లలు ఉన్నారని సీఎంఓ తాజా గణాంకాలను వెల్లడించింది. వీరిలో 172 మృతదేహాలను బంధువులు గుర్తించారని, వివిధ ప్రాంతాల నుంచి 180 మృతదేహాల విడిభాగాలు లభ్యమయ్యాయని, 161 పోస్టుమార్టంలు పూర్తయ్యాయని తెలిపింది. వయనాడ్, కోజికోడ్, మలప్పురం జిల్లాల్లో 91 మంది చికిత్స పొందుతుండగా, 256 మందిని ఇప్పటికే ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేశారు.

**జాతీయ విపత్తుగా ప్రకటించేందుకు బీజేపీ నిరాకరణ**

వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో సహా వివిధ వర్గాల నుంచి వస్తున్న డిమాండ్‌ను బీజేపీ తోసిపుచ్చింది. కేంద్ర ప్రభుత్వ గైడ్స్‌లైన్ ప్రకారం జాతీయ విపత్తుగా ప్రకటించే అవకాశమే లేదని బీజేపీ తెలిపింది. దీనిపై యూపీఏ ప్రభుత్వ హయాం నుంచి విధానపరమైన నిర్ణయంలో ఎలాంటి మార్పు జరగలేదని తెలిపింది. ప్రకృతి వైపరీత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించే ప్రొవిజన్ ఏదీ లేదని 2013 ఆగస్టు 6న అప్పటి హోం మంత్రి ముల్లపల్లి రామచంద్రన్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పిన విషయాన్ని బీజేపీ సీనియర్ నేత వి.మురళీధరన్ ఫేస్‌బుక్ పేజ్‌లో పోస్ట్ చేశారు.

## అమెరికా మాంద్యం భయాలతో కుప్పకూలిన స్టాక్ మార్కెట్




భారత స్టాక్ మార్కెట్ కు ఇవాళ అత్యంత ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. అమెరికా ఆర్థికమాంద్యం భయాలతో భారత స్టాక్ మార్కెట్ సూచీలు కుప్పకూలాయి. ఇవాళ ఒక్కరోజే మదుపరులకు చెందిన రూ.16 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. సెన్సెక్స్ ఏకంగా 2,222 పాయింట్లు నష్టపోయి 78,759 వద్ద ముగిసింది. నిఫ్టీ 662 పాయింట్ల నష్టంతో 24,005 వద్ద స్థిరపడింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, మెటల్, రియల్ ఎస్టేట్, ఇంధనం, మౌలికవసతులు, ఆటోమొబైల్, ఐటీ పరిశ్రమల షేర్లు తీవ్ర కుదుపులకు గురయ్యాయి. టాటా మోటార్స్, టాటా స్టీల్, ఎస్బీఐ, పవర్ గ్రిడ్, మారుతి సుజుకి, జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. హెచ్ యూఎల్, నెస్లే ఇండియా షేర్లు మాత్రం నష్టాల నుంచి తప్పించుకున్నాయి.

## ఐదో వార్షికోత్సవం.. బీజేపీ ర్యాలీ..
# అమర్నాథ్ యాత్ర నిలిపివేత

**శ్రీనగర్ :** మోదీ ప్రభుత్వం 'ఆర్టికల్ 370'ని రద్దు చేసి.. నేటికి అంటే ఆగస్ట్ 5వ తేదీకి అయిదేళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో ఆర్ఎస్ పురాలోని బానా సింగ్ స్టేడియంలో ఏకాత్మ మహొూత్సవ ర్యాలీని బీజేపీ చేపట్టనుంది. సరిగ్గా అయిదేళ్ల క్రితం ఇదే రోజున అంటే.. 2019, ఆగస్ట్ 5వ తేదీన ఆర్టికల్ 370ని మోదీ ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏకాత్మ మహొత్సవ్ పేరిట ర్యాలీ నిర్వహించాలని బీజేపీ సంకల్పించింది.

**మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఫైర్..**

మరోవైపు ఈ రోజును ప్రతిపక్షాలు బ్లాక్ డేగా అభివర్ణించాయి. జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 రద్దు చేయడంతో మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడుతున్న సంగతి అందరికి తెలిసిందే. అంతేకాదు.. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు సైతం స్పందిస్తున్నారు. ఈ ఆర్టికల్ రద్దు చేసిన ఈ అయిదేళ్లలో ఏం సాధించారని బీజేపీని జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రవీంద్ర శర్మ ప్రశ్నించారు. అందుకు సంబంధించి.. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీజేపీపై ఉందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజలకు తగిలిన గాయాలపై కారం జల్లుతుందంటూ బీజేపీపై మండిపడ్డారు. ఆర్టికల్ రద్దు చేసి.. నేడు వేడుకలు జరపడం సిగ్గు చేటంటూ బీజేపీకి చురకలంటించారు. ఆర్టికల్ 370 రద్దుకు నిరసనగా మహారాజా హరిసింగ్ పార్క్ వద్ద ఈ రోజు ఆందోళన నిర్వహిస్తామని డెమొక్రటిక్ ప్రొగసీవ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) ప్రతినిధి పేర్కొన్నారు.

**ఈ రోజు అమర్నాథ్ యాత్రకు విరామం..**

ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో అధికార బీజేపీ వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమైంది. మరోవైపు ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. ఈ నేపథ్యంలో అమర్నాథ్ యాత్రకు ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం విరామం ప్రకటించింది. దీంతో అమర్నాథ్ యాత్రికులు భగవత్ క్యాంప్‌లో ఉండిపోయారు.



ఇంకోవైపు ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టింది.

**రెండోసారి అధికారం చేపట్టిన కొద్ది రోజులకే..**


2019 ఎన్నికల్లో నరేంద్ర మోదీ వరుసగా రెండో సారి అధికారాన్ని చేపట్టారు. ఆ కొద్ది రోజులకే ఆయన జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక అధికారాలున్న ఆర్టికల్ 370ని రద్దు చేశారు. దాంతో ఆ ఆర్టికల్ రద్దు అయి నేటికి అయిదేళ్లు పూర్తి అయింది.

**అసెంబ్లీ ఎన్నికలకు సీఈసీ సన్నాహకాలు..**

మరోవైపు జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహకాలు చేస్తుంది. అందులోభాగంగా ఆగస్ట్ 8వ తేదీ నుంచి ఆగస్ట్ 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు కేంద్ర ఎన్నికల సంఘం ఆ రాష్ట్రంలో పర్యటించనుంది. అనంతరం కొద్దిరోజులకే అసెంబ్లీ ఎన్నికల నగారాను మోగించనున్నదని తెలుస్తుంది. ఇంకోవైపు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్ ప్రజలు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. అయితే ఆర్టికల్ 370 రద్దు అనంతరం తొలిసారిగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు కావడంతో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఆసక్తిని కనబరుస్తున్నారు.

## బిజినెస్

## పెట్రో స్థానంలో స్వచ్ఛ ఇంధనం



పెట్రోల్, డీజిల్ కార్ల స్థానంలో పర్యావరణ హిత సాంకేతికతతో నడిచే వాహనాలను భర్తీ చేసే విధాన పరమైన నిబంధనావళి కోసం మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ఎదురు చూస్తోందని ఆ కంపెనీ ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ వెల్లడించారు. ఎంఎస్ఐ వార్షిక నివేదిక (2023–24)లో వాటాదార్లనుద్దేశించి ఆయన ఏమన్నారంటే..'విద్యుత్ వాహనాల తయారీలో ఎంఎస్ఐ నిదానంగా ఉందని కొందరు అంటున్నారు. కానీ పెట్రోల్, డీజిల్ కార్ల స్థానంలో పర్యావరణ హిత కార్లను తీసుకొచ్చే సాంకేతికతలను ప్రోత్సహించే విధానాల కోసం ఎదురుచూస్తున్నాం. ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులు, వనరుల లభ్యతను పరిగణనలోకి తీసుకుని విభిన్న సాంకేతికతలతో, వివిధ ధరల్లో మెరుగైన కార్లను అందించడమే మా వ్యూహం'. 'హైబ్రిడ్ కార్లు ఇంధన సామర్థ్యాన్ని 35–45% మెరుగుపరుస్తాయి. కర్బన ఉద్గారాలను 25–35% తగ్గించడంలో సహాయపడతాయి. సీఎన్‌జీ కార్లు హైబ్రిడ్ కార్లంత శుభ్రంగా ఉండవు. కానీ పెట్రోల్, డీజిల్ కార్ల కంటే మెరుగ్గా ఉంటాయి. సీఎన్‌జీ పంపిణీకి మౌలిక సదుపాయాల నిర్మాణం జరుగుతున్నందున, సీఎన్‌జీ కార్ల విక్రయాలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది మారుతీ 6 లక్షల సీఎన్‌జీ కార్లను విక్రయించే అవకాశం ఉంది'. 'వ్యవసాయ, జంతు, మానవ వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేయడానికి మనదేశంలో భారీ అవకాశాలున్నాయి. మారుతీ మానేసర్ ప్లాంట్‌లో బయోగ్యాస్ ఉత్పత్తి చేయడానికి ప్రయోగాత్మక పని ప్రారంభమైంది. 'ప్రస్తుతం 20% ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడొచ్చు ఇథనాల్ శాతాన్ని మరింత పెంచి, ఉపయోగించుకునేలా సాంకేతికత అందుబాటులో ఉంది. ఇందుకోసం కార్ల ఇంజిన్లలో మార్పులు చేయాల్సి ఉంది. వాహన పరిశ్రమ అభివృద్ధి చెందుతున్నా, ఖరీదైన కార్లను కొనుగోలు చేయలేని వినియోగదార్లను ఎంఎస్ఐ ఎప్పటికీ మరిచిపోదు'.

### ఆర్‌బీఐ పాలసీ వైపు ఇన్వెస్టర్ల చూపు



**న్యూఢిల్లీ:** ఆర్‌బీఐ వడ్డీ రేట్ల నిర్ణయం, మాక్రో ఎకనామిక్ డేటా, గ్లోబల్ అంశాలు ఈ వారం మార్కెట్ కదలికలను ప్రభావితం చేయనున్నాయని ఎనలిస్టులు పేర్కొన్నారు. అంతేకాకుండా విదేశీ ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) యాక్టివిటీ, కంపెనీల క్యూ1 రిజల్ట్స్‌పై కూడా ట్రేడర్లు ఫోకస్ పెట్టాలన్నారు. ఆగస్టు 8 న మానిటరీ పాలసీ వివరాలను ఆర్‌బీఐ ప్రకటించనుంది. ఈసారి కూడా వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తారని ఎనలిస్టులు భావిస్తున్నారు. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, ఎన్‌హెచ్‌పీసీ, ఎల్ఐసీ, ఎంఆర్ఎఫ్‌ల క్యూ1 ఫలితాలు ఈ వారం విడుదల కానున్నాయి. ఈ షేర్లలో తీవ్ర కదలికలు ఉండొచ్చు. మరోవైపు ఫారిన్ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) కిందటి నెలలో నికరంగా రూ.32,365 కోట్లను మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేశారు. కానీ, ప్రస్తుత నెలలోని మొదటి రెండు ట్రేడింగ్ సెషన్లలో నికరంగా రూ.1,027 కోట్లను విత్‌డ్రా చేసుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో రూ.26,565 కోట్లను ఇన్వెస్ట్ చేశారు.

# చైనా నుంచి దిగుమతుల కంటే ఇన్వెస్ట్‌మెంట్లను పెంచాలి

న్యూఢిల్లీ: చైనా నుంచి ప్రొడక్ట్‌లను దిగుమతి చేసుకోవడం కంటే ఆ ప్రొడక్ట్‌లను తయారు చేసే కంపెనీలు ఇండియాలో తయారీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు ప్రభుత్వానికి సలహా ఇస్తున్నారు. బడ్జెట్ ముందు విడుదలైన ఎకనామిక్ సర్వే కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. చైనా నుంచి ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఎఫ్‌డీఐ) పెరిగేలా చూడాలని, లోకల్ మాన్యుఫాక్చరింగ్ సెక్టార్‌ను బలోపేతం చేసి ఎగుమతులు పెంచుకోవాలని పేర్కొంది. ఇదే అభిప్రాయాన్ని నీతి ఆయోగ్ మెంబర్ అర్వింద్ విర్మాని ఆదివారం వ్యక్తం చేశారు. 'చైనా నుంచి గత పదేళ్లు, పదిహేనేళ్ల నుంచి దిగుమతులు చేసుకుంటున్నాం. దిగుమతులు తప్పవు అనుకుంటే చైనీస్ కంపెనీలు ఇండియాలోనే ఈ ప్రొడక్ట్‌లను తయారు చేసేలా చూడడం బెటర్' అని ఆయన ప్రభుత్వానికి సలహా ఇచ్చారు. యూఎస్, యూరోపియన్ కంపెనీలు చైనా నుంచి దిగుమతులు తగ్గించుకోవాలని చూస్తున్న ప్రస్తుత తరుణంలో, ఇండియాలో చైనీస్ కంపెనీలు తయారీ మొదలు పెట్టడం ఉత్తమమం. మన దగ్గర నుంచి ప్రొడక్ట్‌లను ఎగుమతి చేయగలుగుతాయి. 'చైనా ప్లస్ వన్' స్ట్రాటజీ నుంచి ఇండియా రెండు విధాలుగా ప్రయోజనం పొందొచ్చు. చైనా సప్లయ్ చెయిన్‌లో ఇండియా కూడా ఇంటిగ్రేట్ కావడం. లేదా చైనా నుంచి ఇన్వెస్ట్‌మెంట్లను ఆకర్షించడం. చైనా నుంచి దిగుమతులకు అనుమతివ్వడం కంటే ఇది బెటర్ అని విర్మాని అన్నారు. పైన పేర్కొన్న రెండు ఛాయిస్‌లలో ఎఫ్‌డీఐలను ఆకర్షించడంపై ఆయన మొగ్గు చూపారు. ఎఫ్ఐడీలు ఆకర్షిస్తే ఇండియా నుంచి యూఎస్‌కు ఎగుమతులు పెరుగుతాయని అన్నారు. అంతేకాకుండా ఎఫ్‌డీఐలపై ఆధారపడడం వలన



చైనీస్ ప్లస్ స్ట్రాటజీ మరింత సమర్ధవంతంగా అమలు చేయొచ్చని తెలిపారు. ఎందుకంటే చైనా నుంచి ఇండియా భారీగా దిగుమతులు చేసుకుంటోందని, ఈ దేశంతో మన ట్రేడ్ డెఫిసిట్ ఎక్కువగా ఉందని వివరించారు. కాగా, 2000 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి మధ్య చైనా నుంచి 2.5 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు ఇండియాలోకి వచ్చాయి. ఎఫ్‌డీఐలు చేసిన టాప్ దేశాల్లో చైనా 22 వ స్థానంలో ఉంది. ఇండియాలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో ఇది కేవలం 0.37 శాతం వాటాకు సమానం. ఇండియాలోకి చైనా ఇన్వెస్ట్‌మెంట్లు తక్కువగా ఉన్నా, ఇరు దేశాల మధ్య వాణిజ్యం మాత్రం భారీగా పెరిగింది. కిందటి ఆర్థిక సంవత్సరంలో 118.4 బిలియన్ డాలర్ల విలువైన వ్యాపారం జరిగింది. ఇండియా నుంచి చైనాకు ఎగుమతులు 8.7 శాతం గ్రోత్ సాధించి 16.67 బిలియన్ డాలర్లకు చేరుకున్నా, చైనా నుంచి దిగుమతులు మాత్రం ఏకంగా 101.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ట్రేడ్ డెఫిసిట్ ఏకంగా 85 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

# రిటైర్‌మెంట్ ప్రకటించిన గౌతమ్ అదానీ

దేశంలో బడా పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచవ్యాప్తంగా ఓడరేవుల నిర్మాణం, నిర్వహణ, వంటనూనెల తయారీ, గ్రీన్ ఎనర్జీ, గ్యాస్ వెలికితీత..వంటి ఎన్నో రంగాల్లో ఆయన వ్యాపారం నిర్వహిస్తున్నారు. అదానీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ(62) తన 70వ ఏటా పదవీవిరమణ చేయబోతున్నట్లు ప్రకటించారు. 2030ల్లో వ్యాపార సామ్రాజ్య పట్టపు పగ్గాలను తన వారసులకు కట్టబెడుతానని స్పష్టం చేశారు. ఈమేరకు బ్లూమ్‌బర్గ్ నివేదికలో వివరాలు వెలువడ్డాయి. ఒక తరం నుండి మరొక తరానికి నియంత్రణ బదిలీ అనేది దేశంలోని పెద్ద వ్యాపార సమూహాలలో ఎల్లప్పుడూ వివాదాస్పద అంశం. రిలయన్స్ నుండి గోద్రెజ్, కెకె మోడీ గ్రూప్ వరకు వ్యాపార సామ్రాజ్యాల విభజనకు సంబంధించిన వివాదాలు కోర్టుకు చేరి వార్తల్లో నిలిచాయి. దేశంలోనే రెండో అత్యంత



సంపన్నుడైన గౌతమ్ అదానీ తన కుటుంబంలో ఇలాంటి వివాదాస్పద పరిస్థితి రాకుండా ఉండేందుకు ఇప్పటికే ప్లాన్ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ తనకు 70 ఏళ్లు వచ్చేసరికి పదవీ విరమణ చేయబోతున్నట్లు బ్లూమ్‌బెర్గ్ నివేదిక పేర్కొంది. ప్రస్తుతం గౌతమ్ అదానీ వయసు 62 ఏళ్లు. అంటే అతను రాబోయే 8 సంవత్సరాలలో క్రియాశీల వ్యాపారం నుండి రిటైర్ కావచ్చు. అతని తర్వాత వ్యాపార సామ్రాజ్యన్ని నడిపించే బాధ్యత అతని కొడుకులు, మేనల్లుళ్ల భుజాలపై పడుతుంది. ఈ మార్పు అమలు 2030 నుండి ప్రారంభమవుతుంది. గౌతమ్ అదానీ పదవీ విరమణ చేసిన తర్వాత తన కుమారులు కరణ్ అదానీ, జీత్ అదానీ, సోదరుడి కుమారులు ప్రణవ్ అదానీ, సాగర్ అదానీ సంస్థలో సమాన లబ్ధిదారులు అవుతారని నివేదిక ద్వారా తెలిసింది. అదానీ గ్రూప్ వెబ్‌సైట్ ప్రకారం గౌతమ్ అదానీ పెద్ద కుమారుడు కరణ్ అదానీ..అదానీ పోర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. చిన్న కుమారుడు జీత్ అదానీ..అదానీ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

# భారత షూటర్లకు షాక్.. ఒక్క పాయింట్‌తో పతకం పోయే

పారిస్ ఒలింపిక్స్ పదో రోజు భారత్ రెండో కాంస్యాన్ని కోల్పోయింది. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మహేశ్వరి చౌహాన్ అనంత్ జీత్ సింగ్ నరుక జోడీ ఒక్క పాయింట్‌తో పతకం చేజార్చుకుంది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో 146 పాయింట్లతో 4వ స్థానంలో నిలిచిన మహేశ్వరి, అంకిత్ జోడీ కాంస్య పోరులోనూ రాణించింది. కానీ, చివరకు చైనా జంట జియంగ్ ఇతింగ్, లియూ జియన్లి 44 – 43తో కంచు మోత మోగించింది. . మహేశ్వరి, అనంత్ ద్వయం విజయానికి దగ్గరగా వచ్చినా ఒకే ఒక పాయింట్ అంతరంతో పతకాన్ని అందుకోలేకపోయింది. మరోవైపు యువ షట్లర్ లక్ష్య సేన్ సైతం చరిత్రకు అడుగు దూరంలో ఆగిపోయాడు. విశ్వ క్రీడల్లో తొలి కాంస్యం గెలుస్తాడనుకుంటే గాయం కారణంగా



ఊహించని రీతిలో ఓడాడు. కాంస్య పతక పోరులో మలేషియా షట్లర్ లీ జిల్ జియా చేతిలో 21–13, 16–21, 11–21తో పరాజయం పాలై కోట్లాదిమందిని నిరాశపరుస్తూ భారమైన గుండెతో కోర్టును వీడాడు. ఇక రెజ్లింగ్ పోటీల్లో



నిషా దహియా క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. 68 కిలోల విభాగంలో టెటియన రిజ్కో(ఉక్రెయిన్)ను 6–4తో ఓడించిన ఈ యువకెరటం పతకం వేటలో అడుగుముందుకు వేసింది.

## బంగ్లాదేశ్‌లో సైనిక పాలన.. టీ20 వరల్డ్ కప్ జరిగేనా?

బంగ్లాదేశ్‌లో చెలరేగుతున్న హింస ప్రపంచ క్రికెట్‌పై పడనుంది. ఆ దేశ ప్రధాని షేక్ హసీనా రాజీనామాతో సైన్యం దేశాన్ని గుప్పిట్లోకి తీసుకుంది. బంగ్లాలో ఎప్పుడు సాధారణ రోజులు వస్తాయో తెలియడం లేదు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో మరో రెండు నెలల్లో జరగాల్సిన మహిళల టీ20 వరల్డ్ కప్‌పై అనిశ్చితి నెలకొంది.
ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ అక్కడి ఉద్రిక్త పరిస్థితులను నిశితంగా గమనిస్తోంది. ఒకవేళ హింసాత్మక ఘటనలు ఇంకొన్ని రోజులు కొనసాగితే బంగ్లా నుంచి వరల్డ్ కప్ వేదికను తరలించే అవశాశముంది. 'బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుతో కలిసి ఐసీసీ ఆ దేశంలోని పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తోంది. బీసీబీ భద్రతాధికారులతో పాటు మా స్వతంత్ర సిబ్బంది సైతం పరిస్థితిని ఆరా తీస్తోంది. మెగా టోర్నీలో పాల్గొనే క్రికెటర్ల భద్రతే మా ప్రధాన ఉద్దేశం' అని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం మహిళల టీ20 వరల్డ్ కప్ తొమ్మిదో సీజన్ బంగ్లాదేశ్‌లో అక్టోబర్ 3న షురూ కానుంది. ఒకవేళ






బంగ్లాలో ఈ మెగా నిర్వహించడం సాధ్యంకాని పక్షంలో ఐసీసీ కొత్త వేదికను ప్రటించనుంది.

## స్పోర్ట్స్

### కాంస్యం చేజార్చుకున్న లక్ష్యసేన్.. క్వార్టర్ ఫైనల్లో రెజ్లర్ నిషా



పారిస్ ఒలింపిక్స్‌లో భారత షట్లర్ లక్ష్య సేన్ చరిత్రకు అడుగు దూరంలో ఆగిపోయాడు. విశ్వ క్రీడల్లో తొలి కాంస్యం గెలుస్తాడనుకుంటే ఈ యువ ఆటగాడు ఊహించని రీతిలో ఓడాడు. కాంస్య పతక పోరులో మలేషియా షట్లర్ లీ జిల్ జియా చేతిలో ఓడి కోట్లాదిమందిని నిరాశపరిచాడు. ఇక రెజ్లింగ్ పోటీల్లో నిషా దహియా క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. 68 కిలోల విభాగంలో టెటియన రిజ్కో(ఉక్రెయిన్)ను 6–4తో ఓడించిన ఈ యువకెరటం పతకం వేటలో అడుగుముందుకు వేసింది.

**తొలి సెట్ అలవోకగా..**

సోమవారం జరిగిన కంచు పోరులో లక్ష్య సేన్ అలవోకగా తొలి సెట్‌ను గెలిచాడు. ఆ తర్వాత వెనకబడి 21–13, 16–21, 11–21తో పరాజయం పాలై భారమైన గుండెతో కోర్టును వీడాడు.రెండో సెట్‌లో లీ నుంచి భారత స్టార్‌కు ఊహించని ప్రతిఘటన ఎదురైంది. అయితే తన మార్క్ షాట్లతో చెలరేగి ఆధిక్యాన్ని తగ్గించాడు. కానీ, మలేషియా షట్లర్ 21–16తో రెండో సెట్ గెలుపొందాడు. దాంతో, మ్యాచ్ మూడో సెట్‌కు వెళ్లింది. నిర్ణయాత్మక సెట్‌లో లక్ష్య సేన్ వెనకబడ్డాడు. మోచేతి గాయం కూడా అతడిని ఇబ్బంది పెట్టింది. ఇదే అదనుగా లీ కచ్చితమైన షాట్లతో విరుచుకుపడి కాంస్య పతకాన్ని తన్నుకుపోయాడు. దాంతో, బ్యాడ్మింటన్‌లో సైనా నెహ్వాల్, పీవీ సింధుల తర్వాత ఒలింపిక్ పతకం గెలిచిన మూడో ప్లేయర్‌గా రికార్డుకెక్కాలనుకున్న లక్ష్య సేన్ కల చెదిరింది.

Printed, Published and Owned by B.ANILKUMAR, H. No. 2-6 Tharigoppula, Jangoan Dist. - 506224, Telamgana State published at DAIWIK PUBLICATION pvt Ltd. printed at SNEHITHA PRINTERS H.NO. 2-6, Tharigoppula, Jagoan Dist- 506224 Telangana State Editor: B.ANILKUMAR, RNI No.: TELTEL/ 2021/81079, Cell:7702866885 Email: vijethatelugudaily@gmail.com